క్లుప్తంగా

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

తల్లాడ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ అగ్రికల్చర్ ఫార్మసీ వెల్ఫేర్ కమిషన్ డైరెక్టర్ రామిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ముచ్చటించారు. కార్యక్రమంలో తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మారెడ్డి, అంజయ్య, జమాల్, పాపారావు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం



మందులు అందిస్తున్న వైద్యాధికారులు

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం విజయవంతమైంది. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ.. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్, యంగల ఆనందరావు, గిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మరమ్మతుల కారణంగా సోమవారం కల్లూరులో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టౌన్–1లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ వెంకట్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా మధిర రోడ్, తిరువూరు క్రాస్ రోడ్, నారాయణపురం లోనూ అంతరాయం వుంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేసు నమోదు

వేంసూరు: మండలంలోని కేజీ మల్లెల పంచాయతీలో గత నెల 22న జరిగిన రోడ్డు ప్రమాదంపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన కారుమంచి వెంకటేశ్వరరావు గత నెల 22న రాత్రి బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా.. అతి వేగంగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైయ్యాయి. దీంతో కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు కుమారుడు కారుమంచి ప్రసాద్ ఫిర్యాదు చేయగా ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆన్‌లైన్ మోసంపై..

వేంసూరు: మండలంలోని మర్లపాడు గ్రామానికి చెందిన కొత్త కార్తీక్‌కు ఎస్‌బీఐ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీకు పీఎం కిసాన్ యాప్ డౌన్లోడ్ అయిందని, మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతున్నాము, మీ వాట్సాప్ స్క్రీన్ షేర్ చేయమని ప్రతి రోజు ఫోన్ చేస్తుండేవారని, గతేడాది నవంబర్ లో ఓ వెబ్ సైట్ ద్వారా నాలుగు దఫాలుగా రూ.49,944 డెబిట్ అయ్యాయని, తమకు కాల్ చేసిన నంబర్ కాల్ చేయగా సమాధానం లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై ఆదివారం బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొదుమూరు ఏఎన్‌ఎం మృతి

చింతకాని: మండలంలోని కొదుమూరు ఆరోగ్య ఉపకేంద్రంలో రెండో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న జాన్సీ(46) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని మండల వైద్యాధికారి అల్తాఫ్, పల్లె దవాఖానా వైద్యులు వెంకటేశ్వరరావు, సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, ఏఎన్‌ఎంలు సందర్శించి నివాళులర్పించారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

మధిర: మధిర పట్టణంలోని మదర్‌థెరిస్సా సేవాసదనం, మానసిక దివ్యాంగుల పునరావాస కేంద్రంలో వీరమాచినేని శ్రీనివాసరావు 3వ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు కౌన్సిలర్ నాగసులోచన, వికాస్, భావన, అశోక్, వైష్ణవి ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాకేదీ భరోసా..?



పల్లిపాడు చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

విలీన గ్రామాల కూలీలపై స్పష్టత కరువు
- ఏళ్లుగా 'ఉపాధి'కి దూరం
- అత్యధికులు భూమిలేని నిరుపేదలే

కొణిజర్ల: భూమి లేని నిరుపేదలకు ఏ కాలంలో అయినా ఉపాధి పనులు కల్పించడానికి చక్కటి వేదికగా మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఉపయోగ పడుతుది. ఈ పనుల్లో వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే మండలంలోని పలు గ్రామాలు ఆరేళ్ల క్రితం వైరా మున్సిపాలిటీలో విలీనం కావడంతో ఆయా గ్రామాల నిరుపేదలంతా పట్టణ ప్రాంత వాసులుగా మారిపోవడంతో ఉపాధి హామీ పథకాన్ని ఆ గ్రామాల్లో రద్దు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆత్మీయ భరోసా పథకానికి దూరమయ్యారు. ప్రభుత్వం నుంచి మున్సిపాలిటీ విలీన గ్రామాలలో నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ఎలాంటి స్పష్టమైన ఆదేశాలు లేక పోవడంతో తమ పరిస్థితి ఏంటని అయా గ్రామాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి హామీ పథకం పనులు ఎలాగూ లేవని, కనీసం ఆత్మీయ భరోసా అయినా అందించాలని కోరుతున్నారు.

బయట పనులకు పోతున్నా..



మా ఊరిని వైరా మున్సిపాలిటీలో కలిపిన తర్వాత ఆరేళ్లుగా ఉపాధి పనులు నిలిపి వేశారు. ఊర్ల కూడా పనులు లేవు. వ్యవసాయం చేసుకుందామంటే సెంటు భూమి లేదు. అందుకే రోజు కూలీకి పోతున్నా. రెక్కాడితేనే డొక్కాడే మాలాంటి వారిపై ప్రభుత్వం దయ ఉంచి ఇందిరమ్మ భరోసా పథకం మాకు కూడా ఇవ్వాలి.

– భూక్యా నరసింహారావు, పల్లిపాడు

పట్టణ ప్రజలకూ ఉపాధి కల్పించాలి



వైరా మున్సిపాలిటీలో విలీనం అయిన గ్రామాల ప్రజలందరికీ ఉపాధి పనులు కలిపించాలి. నిరుపేదలే ఎక్కువగా ఉన్నారు. నిత్యం కూలీకి పోతేనే రోజు గడిచే నిరుపేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలి. రూ 12 వేలు ఏటా ఆర్థిక సాయం అందించి కుటుంబాలను ఆదుకోవాలి.

– అనుమోలు రామారావు, సీఐటీయూ నాయకుడు

ఉపాధి పనులకు వెళ్తేనే భరోసా..

ఆత్మీయ భరోసా పథకానికి 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 20 రోజులు పని చేసినట్లు ఉంటేనే వారిని అర్హులుగా గుర్తించి ఎంపిక చేశారు. ఉపాధి హామీ జాబ్‌కార్డు ఆధార్‌కార్డు లింక్ అయి ఉన్న వారి వివరాలు మాత్రమే ఆన్‌లైన్ కన్పిస్తాయి. ఆ పేర్ల ఆధారంగానే డీఆర్‌డీఏ అధికారులు గ్రామాలలో లబ్ధిదారులను జిల్లా స్థాయిలోనే ఎంపిక చేసి గ్రామాలకు పంపించారు. ఆరేళ్లుగా ఉపాధి పనులు లేక పనులకు వెళ్లేందుకు అవకాశం లేని తమకు భరోసా ఎలా అందుతుందని ఆయా గ్రామాల నిరుపేదలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మీయ భరోసా పథకం కూడా ఆయా గ్రామాలలో అమలు చేస్తారా లేదా అనేది స్పష్టత లేకుండా పోయింది. అటు అధికారులు కానీ, ఇటు ప్రజా ప్రతినిధులు కానీ దీనిపై ఎలాంటి కటన విడుదల చేయకపోవడంతో విలీన గ్రామాల పేదలు సాయం కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి మున్సిపాలిటీ విలీన గ్రామాల నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింప చేయాలని కోరుతున్నారు.

విలీనంతో పోయిన ఉపాధి..

కొణిజర్ల మండలంలోని లాలాపురం, పల్లిపాడు, దిద్దుపూడి, గుండ్రాతిమడుగు పంచాయతీ పరిధిలోని శాంతినగర్ కాలనీలు 2018లో వైరా మున్సిపాలిటీలో విలీనం చేశారు. వైరా మండలంలోని గండగలపాడు, సోమవరం గ్రామాలను సైతం మున్సిపాలిటీలో కలిపారు. మధిర మండలంలోని మడుపల్లి, ఇల్లందుల పాడు, అంబారుపేట, జిలుగుమాడు గ్రామాలను మధిర మున్సిపాలిటీలో విలీనం చేశారు. నాటి నుంచి ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిపివేశారు. ఆయా గ్రామాల్లో ప్రతీ ఏటా సుమారు 2,500 మందికి పైగా ఉపాధి హామీ పనులకు వెళ్తుండగా వారికి పనులు పోవడంతోపాటు ఆయా గ్రామాల్లో కూలీలతో పనులు చేయించే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు సైతం ఉద్యోగ భృతి పోయింది. విలీన గ్రామాల్లో తిరిగి ఉపాధి పనులు ప్రవేశపెట్టాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చినా, పలు రైతు సంఘాల నాయకులు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



హోమ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర తొలి స్పీకర్ మధుసూదనాచారి

కారేపల్లి: కారేపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ విగ్రహ, ధ్వజస్తంభ, నందీశ్వర గణపతి, నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు దాసోజు పరిపూర్ణాచారి మంత్రోచ్ఛరణల నడుమ గ్రామ ప్రజలు విగ్రహాల ప్రతిష్ఠను అత్యంత వైభవంగా నిర్వహించగా.. పలుగ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి వేర్వేరుగా హాజరై పూజలు నిర్వహించారు. అతిథులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా శ్రీనివాసమూర్తి కల్యాణం



శ్రీనివాసమూర్తి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: తల్లాడలో హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం 22వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఆలయంలో గోవింద పట్టాభిషేకం, అష్టోత్తర శతకలశ స్నపనము, పూర్ణాహుతి, ఆచార్య సన్మానం జరిగింది. శ్రీనివాసమూర్తికి ముత్యాల చలువ చప్పరంలో నయానందకరముగా గ్రామోత్సవం జరిగింది. శనివారం రాత్రి శ్రీనివాసమూర్తి కల్యాణం తిరుపతి వేద విశ్వ విద్యాలయం అధ్యాపకులు రొంపిచర్ల వెంకటసత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు దివి సీతారామాచార్యులు, పరాంకుశం యోగానదకార్తికేయా చార్యులు, విఖనసాచార్యులు, బాలక్రిష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠ పూజలు



వేంకటేశ్వర స్వామి, దేవతా మూర్తుల విగ్రహాలకు అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో ఈ నెల 9వ తేదీన ప్రతిష్ఠ జరుగనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి, దేవతా మూర్తుల విగ్రహాలకు ఆదివారం భక్తిశ్రద్ధలతో విశేష పూజలు, పంచగావ్య అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు గిరిధరాచార్యులు పర్యవేక్షణలో 22మంది రుత్వికులతో ఆదివాసహోమం, పూర్ణాహుతి, గోపూజ, ఏకనామ సంకీర్తనలు, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్, మండపాటి కేశవరెడ్డి, దురిశేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా చెట్ల నరికివేత



పల్లిపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన నరికిన భారీ వృక్షం

కొణిజర్ల: మండలంలో పలువురు వ్యాపారస్తులు వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. జాతీయ రహదారి పక్కన పెద్ద పెద్ద చెట్లను అనుమతులు లేకుండా కొంతమంది ఇష్టానుసారం నరికి వేస్తున్నారు. కొణిజర్ల, పల్లిపాడు మధ్య జాతీయ రహదారి పక్కన ఏళ్ల తరబడి పెరిగిన పెద్ద పెద్ద చెట్లను కొంత మంది వ్యాపారస్తులు తమ వ్యాపారసముదాయాలకు అడ్డంగా ఉన్నాయని నరికించేశారు. దీనిపై అటు జాతీయ రహదారుల అధికారులకు, ఇటు అటవీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లు నరికే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలో తుమ్మల పర్యటన



ఎర్రుపాలెం: మీనవోలులో మంత్రి తుమ్మలను కలిసిన ఏఎంసీ చైర్మన్ బండారు నర్సింహారావు

మధిర/బోనకల్/ఎర్రుపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా బోనకల్‌లోని మోటమర్రి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు పతంగి వెంకటేశ్వర్లు ఇంట్లో జరిగిన దైవ కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు. అదే విధంగా మధిరలో నాయకులు తుమ్మలకు ఘన స్వాగతం పలికారు. ఎర్రుపాలెంలోని మీనవోలుగ్రామంలోని సెంటర్లో మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావును కలిశారు. ఈ సందర్భంగా రైతుల సాగు వివరాలపై ఆరా తీశారు. అనంతరం పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరక్టర్లు బాబురావు, పిచ్చిరెడ్డి, రజకసంఘం రాష్ట్ర నాయకులు బ్రహ్మయ్య, నాయకులు జిల్లా కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, నాగేశ్వరావు, సుధాకర్, నాగార్జున, కృష్ణప్రసాద్, కృష్ణారావు, అప్పారావు, ఇస్మాయిల్, జానీబాషా పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్సీ తాతా మధు..

కల్లూరురూరల్: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. కల్లూరులో ప్రముఖ వ్యాపారవేత్త గుర్రం గోవర్ధన్ – మౌళికల కుమార్తె వైష్ణవి ప్రతాన కార్యక్రమంలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. అదే విధంగా కప్పలబంధంలో ఇటీవల అనారోగ్యానికి గురైన బీఆర్‌ఎస్ నాయకుడు నాగేశ్వరరావు గృహానికి వెళ్లి పరామర్శించారు. మందపాటి నాగిరెడ్డి దశదిన కర్మలో పాల్గొని నాగిరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్కినేని రఘు, మాధవరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

రాయల నాగేశ్వరరావు..

ముదిగొండ: ముదిగొండలోని ఓ పంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకకు రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆదివారం హాజరైయ్యారు. బట్టు రాజు సోదరుడి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గ్రామాల్లో కమల్‌రాజ్..

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం, గుంటుపల్లిగోపవరం గ్రామాల్లో ఆదివారం జెడ్పీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజ్ పర్యటించారు. గుంటుపల్లి గోపారం బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మందడపు మురళీ కుమార్తె అన్నప్రాసన కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. భీమవరంలోని పార్టీ నాయకులు సంజీవరావు కుమారుడు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడగా ఆయనను పరామర్శించారు. ఇదే గ్రామంలో ఒకరి దశదిన కర్మకు హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, తదితరులున్నారు.

ఇది సైలో బంకర్ కాదు.. 'సైకో' బంకర్



నిరాహారదీక్షలో కిష్టారం అంబేద్కర్‌నగర్ వాసులు

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం గ్రామం అంబేడ్కర్‌నగర్ కాలనీలోని ఎస్సీ, బీసీ కాలనీల వాసులు సింగరేణి కాలుష్యం బారి నుంచి తమను కాపాడి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం 21వ రోజుకు చేరింది. మా ప్రాణాలకు ముప్పు కలుగుతుంది మహాప్రభో అని మొత్తుకున్న తమ గోడు సింగరేణి యాజమాన్యం పెడచెవిన పెడుతుందని, అనుమతులు లేని ×సైకో×బంకర్‌ను తమ కాలనీ సమీపాన నిర్మించి కాలనీ ప్రజల ప్రాణాలు బలితీస్తున్న సింగరేణి యాజమాన్యం వేడుక చూస్తుందని ఆరోపించారు. 20రోజులుగా శాంతియుత ధర్నా చేస్తున్నప్పటికీ సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం అంటీ అంటనట్లు వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి మెడలు వంచేలా ధర్నాను ఉధృతం చేస్తామని, తమ పిల్లల భవిష్యత్తును కాపాడుకోవడంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీను, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, మదీన, ప్రభుదాసు, ప్రభాకర్, కోటేశ్వరరావు, కోటిరెడ్డి, సాంబయ్య, చంద్రం, నాగరత్నం, నాగమణి, అరుణ, జాన్‌బీ పాల్గొన్నారు.

మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న గోవిందరావు

చింతకాని: ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బస్వాపురంలో నిర్వహించిన రైతు సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మార్కెట్‌లో కమిషన్‌దారులు నిబంధనల ప్రకారం రైతుల నుంచి 2శాతం కమిషన్‌ను తీసుకోవాల్సి ఉండగా 4 నుంచి 5శాతం కమిషన్‌ను తీసుకుంటున్నారని.. అట్టి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని లేనిచో రైతుల సమన్వయంతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ నెల 20న వైరాలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రైతు సంఘం గ్రామశాఖను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఆవుల పెద్ద వేలాద్రి, అధ్యక్షులు వెంకయ్య, ప్రధాన కార్యదర్శి మార్గం సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఆవుల వెంకయ్య, బుర్ర అంజయ్య, దూదిమెట్ల ఉపేందర్, చేబ్రోలు రవి, ఆవుల బాబు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కోశాధికారి కూచిపూడి రవి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు మార్గం శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



తల్లాడ: కేశ్వాపురంలో మిర్చిని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

తల్లాడ/కారేపల్లి: మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు శీలం సత్యనారాయణరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామంలో మిర్చి కల్లాలను రైతు సంఘం నాయకులు సందర్శించి.. రైతుల భాదలను వారు విన్నారు. అదే విధంగా సీపీఎం బృదం కారేపల్లిలోని పలు గ్రామాల్లోని కల్లాలో పర్యటించి మిర్చిని పరిశీలించారు. ఈ ఏడాది క్వింటా మిర్చికి రూ.14వేల లోపు ధర ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మిర్చి క్వింటాకు రూ.25వేలు చొప్పున కొనుగోలు చేయాలన్నారు. ఈ నెల 3న ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మిర్చి రైతుల ధర్నాను జయప్రదం చేయాలన్నారు. ఇప్పటికైనా పాలక ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రామారావు, రాజారావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీకాంత్, సతీష్, అర్జున్‌రావు, నరసింహారావు, కృష్ణారావు, వేణు, సీపీఎం నాయకులు కరపటి సీతారాములు, జాటోతు హరికిషన్, కల్తి రామచంద్రు, నునావత్ వస్రం, భూక్యా లక్ష్మణ్, నునావత్ చంద్రు, భూక్యా రాంబాబు పాల్గొన్నారు.

కట్లేరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాలి



కట్లేరు ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని కట్లేరు ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ జలాలు విడుదల చేయాలని, కట్లేరు ప్రాజెక్టు వద్ద మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరయ్య, మండల కార్యదర్శి ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కట్లేరు ప్రాజెక్టును పరిశీలించి మాట్లాడుతూ.. ప్రాజెక్టు తూముల వద్ద పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించి సాగర్ జలాలను వెంటనే కట్లేరుకు విడుదల చేసి నింపాలన్నారు. లేనిఋెడల ఈ నెల 5న తహసీల్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు పెద్ద కోటేశ్వరరావు, నాయకులు జోగయ్య, సంజీవరావు, వెంకటేష్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

శ్రీపాదరావు జయంతి వేడుకలు



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీధర్‌రాజా

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ బెటాలియన్‌లో ఆదివారం దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.శ్రీధర్‌రాజా పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ గురుకులం వార్షికోత్సవం



మాట్లాడుతున్న ఏజీఓ తాతారావు

వైరా: వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో శనివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సభకు ముఖ్య అతిధిగా తెలంగాణ గురుకుల విద్యాలయాల ఏజీఓ కె.తాతారావు ముఖ్య అతిధిగా హాజరై బాలికలనుద్దేశించి మాట్లాడారు. చక్కగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం బాలికలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమ, వైరా తహసీల్దార్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సత్తుపల్లిటౌన్: విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక గుడిపాడురోడ్‌లో గల చైతన్య టెక్నోస్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ ఆనంద్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, సుజలరాణి, రాంబాబు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, డైరెక్టర్లు సుజాత, రాకేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంధసిరిలో ఆధార్‌పార్టీ సమావేశం

ముదిగొండ: మండలంలోని గంధసిరిలో ఆధార్‌పార్టీ రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ నియోజకవర్గాల్లో జనాభా ప్రాతిపదికన అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం కల్పించటం, పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ఆధార్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శేషగిరిరావుగౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావుగౌడ్, మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ దీప్తి, నాయకులు పాల్గొన్నారు.